# జ్ఞాపకం



## ఎడతెగని ప్రశ్న

ఒక రోజు రాత్రి మలక్ పేట బస్ స్టాప్ కిటకిటలాడుతూ ఉంది. బహుశా అది చివరి బస్సు. ఆ రోజు నేను చాలా పుస్తకాలూ, ఇంకా చాలా వస్తువులూ కొన్నా. కొన్ని చంకలో ఉన్నాయి, కొన్ని చేతుల్లో పట్టుకో ఉన్నా, బస్సు వచ్చింది. జనం తోసుకుంటున్నారు. ఎట్లాగో ఎక్కుతున్నారు. నేనూ ఎట్లాగో ఆ జనంలో తోసుకుంటూ లోపల పడ్డా. కూర్చోను చోటు లేదు. నుల్చోనే ఉన్నా: పైన ఊచలు పట్టుకోటానికి వీల్లేదు. ఎందుచేతనంటే రెండు చేతుల్లోనూ వస్తువులున్నాయి. చంకలో కూడా ఉన్నాయి. అయినా బాగానే ఉంది. కానీ బస్సు ఎప్పుడు కదిలిందో అప్పుడు అందర్నీ ఒక్కసారి కుదిపింది. నేను గబుక్కున ఊచ పట్టుకున్నాను. చేతులో పుస్తకాలూ, చంకలో వస్తువులూ కిందపడ్డాయి. నా అవస్థ చూడటానికి చాలా ఘోరంగా ఉంది. వంగి పుస్తకాలు తీసుకోటానికి వీల్లేదు. జనం క్రిక్కిరిసి నుల్చో ఉన్నారు: బస్సు స్పీడుగా వంపులు తిరుగుతూ వెళుతూ ఉంది. అప్పుడు-హాయిగా కూర్చో ఉన్న ఒక యువకుడు చప్పున లేచి ఆ సీట్లో నన్ను కూర్చోమని బ్రతిమాలాడు. అప్పటి నా పరిస్థితిలో కూర్చోడం సుఖమే అయినా మొహమాటానికి, కూర్చోను వెనకాడాను. బస్సు పోతూఉంది-నేను ఆశ్చర్య పడ్డాను. నా పరిస్థితిలో అతనూ అతని పరిస్థితిలో నేనూ ఉండి ఉంటే నేను అతనిలా ప్రవర్తించి ఉండేవాడ్నా? ఏమో! నా అంతరాత్మ గట్టిగా సమాధానం చెప్పలేకపోయింది. సిగ్గేసింది నామీద నాకే. ఇంటికొచ్చాను. గదిలో పుస్తకాలు గుట్టలు, గుట్టలుగా పడున్నాయి. ఇవన్నీ ఎందు కనిపించింది, ఆ ప్రశ్నకు నాలో సమాధానం దొరక్కపోతే-

**- గుంటూరు శేషేంద్ర శర్మ**

# ముందు చూపు

యాద్గిరి ఈత కొలను గట్టు మీద నిలుచున్నాడు. కొలనులో కొంతమంది ఈతకొడుతున్నారు. మరి కొంతమంది ఎత్తుమీంచి డైవ్ కొడుతున్నారు. పక్షుల్లా గిరికీలు కొడుతూ ఎత్తునుంచి నీళ్ళలోకి డైవ్ కొడుతున్న వాళ్ళకేసి ఆశగా చూస్తున్నాడు యాద్గిరి. వాళ్ళలా డైవ్ కొట్టాలని అతనికీ ఉబలాటంగా ఉంది. కాని ఇంకా అతనా స్టేజీకి రాలేదు.

తనకూ డైవ్ నేర్పమంటే కోచ్ కుదరదంటున్నాడు. ఈత బాగా రానీ అంటున్నాడు. యాద్గిరి కేమో డైవ్ కొట్టేయాలని ఒకటే తహతహ.

దణ్ణం పెడుతున్నట్టుగా పైకి రెండు చేతులూ జాపి, ఎత్తుమీదనుంచి నీళ్ళలోకి తలక్రిందులుగా డైవ్ కొట్టి, అడుగునుంచి పైకి తెప్పల్లా తేలివచ్చే డైవింగ్ వీరుల్నీ ఆరాధనగా చూసేవాడు యాద్గిరి.



యాద్గిరి వయస్సు 24సంవత్సరాలు. మనిషి బాగాఎత్తు. దానికి తోడు కొంచెం పెద్దదిగా కనిపించే బొజ్జ.

కొలనులోకి దిగకుండా దిక్కులు చూస్తున్న యాద్గిరి దగ్గరకు వచ్చాడు కోచ్.

"ఏంటయ్యా యాద్గిరీ అలా దిక్కులు చూస్తున్నావ్? నీళ్ళలోకి దిగు"అన్నాడు కోచ్.

"నాకు డైవ్ నేర్పించు సామీ"

"ఇదిగో యాద్గిరీ నీవయసెంత?"

"ఇరవైమూడు వెళుతూంది."

"నువ్వు ఈత నేర్చుకుందుకు నాదగ్గరకు వచ్చి ఎన్నాళ్ళయింది."

'పది దినాలయింది.'

అప్పుడే అంత ఎత్తుమీంచి డైవ్ కొడతానంటే ఎట్లాగయ్యా? ప్రమాదం గదా?"

"పెమాదం జరక్కుండా వుండడానికే కదాండ్రి నేర్పించమంట?'

కోచ్ తల పట్టుకున్నాడు.

"ఓరి దేవుడా! ఎక్కడ దొరికావయ్యా మగడా నాకు. ఈతనే సరిగా రాదు. అప్పుడే అంత ఎత్తుపైనుంచి దూకుతానంటే ఎలాగయ్యా? ఈ కొలను లోతెంతో తెలుసా? ఇరవై ఐదు అడుగులు. ఓనెల పాటు ఈపదహారు అడుగుల లోతులో ఈతబాగా నేర్చుకో. ఆతర్వాత ఇక్కడ డైవ్ సంగతి చూడొచ్చు."

యాద్గిరి తుళ్ళిపడ్డాడు.

"ఇంకో నెలా?"

అవును"

"కాని నాకు కుదరదు సామీ'

ఎందుకని?"

"నాకు సర్కారీ నౌకరి వచ్చింది."

"వస్తే రానీ. దీనికి సంబంధం ఏమిటి?"

"సంబంధం వుందీ స్వామీ. నేను వచ్చే నెల మొదటి తారీఖునుంచి నౌకరీకి వెళ్ళాలి. ఊళ్ళు తిరిగే ఉద్యోగం. ఎప్పుడు ఎక్కడ ఉంటానో నాకేతెలియదు. ఇప్పటిలా రోజూ ఈత నేర్చుకోవటానికి రావడం కుదరదు."

కోచ్‌కి కోపం వచ్చింది. "అలాగని అన్నప్రాసన నాడే ఆవకాయ తినిపించమంటే ఎలాగయ్యా? అసలు నీ పొట్టను చూసుకున్నావా?"అన్నాడ

"పెరిగింది సామీ, ఒప్పుకుంటా"

"అలాఇలా పెరగలేదయ్యా, చిన్న సైజు కుండకట్టినట్టుంది. నువ్వు మామూలు ఈత నేర్చుకోవటానికే బాగా కష్టపడాలి. టైము పడుతుంది. అలాంటిది ఇక్కడికి వచ్చి పట్టుమని పదిరోజులు కూడా కాలేదు. అప్పుడే అంతెత్తునుంచి డైవ్ కొడతానంటే ఎలాగయ్యా?"

యాద్గిరి చిన్నపిల్లాడు మారాం చేసినట్టుగా తల అడ్డంగా వూపాడు. "ఏమో, సాఁవీ! అవన్నీ నాకు తెలవదు. నాకు వెంటనే డైవ్ కొట్టడం నేర్పించు."

"నేనో భేషైన సలహా చెప్పనా?"అడిగాడు కోచ్.

"చెప్పండ్రి"అన్నాడు యాద్గిరి.

"సర్కారీ నౌకరీ వచ్చిందంటున్నావు కదా! హాయిగా ఈత గోల మానేసి నౌకరీ చేసుకో"

"ఈత రాకుండా సర్కారీ కొలువు ఎట్లా చేయనండీ?'

"దానికి దీనికి ఏం సంబంధమయ్యా మగడా?"

"సంబంధవేనండ్రి. రేపు ఒకటోతారీఖు నుంచి ఆర్‌టిసి డ్రైవర్‌గా నేను ఉద్యోగానికి ఎక్కాలి. డిస్ట్రిక్ట్ బస్సుల మీద డ్యూటీ వేశారు. ఎప్పుడే కాలవలోకి బస్సు తుర్రుమంటుందో తెలవదాయె? డ్రైవింగ్‌తో పాటు, డైవింగొచ్చుంటే బతికిపోతాను కదా?!"

యాద్గిరి మాటలు విన్న కోచ్ ఓవెర్రికేక పెట్టి గట్టుమీంచి కొలనులోకి డైవ్ కొట్టేశాడు.

**- కమల**